క్లుప్తంగా

శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళి



జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను మండల బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల శాఖ పార్టీ అధ్యక్షుడు బక్క వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పురం మహేశ్, నాయకులు నత్తి మల్లేష్, సత్యనారాయణ, నరేష్‌గౌడ్, మల్లేష్, కృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్‌లు



కుక్కలకు వ్యాక్సిన్‌లు వేస్తున్న లయన్స్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో పెంపుడు కుక్కలకు ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌లు వేశారు. ఈ సందర్భంగా లయన్స్ జిల్లా కార్యదర్శి లింగమూర్తి మాట్లాడుతూ.. కుక్కల నుంచి మనుషులకు రేబీస్ వ్యాధి వస్తుందని అవగాహన కల్పించి పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌లు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, నాగరాజు, నాగేశ్వర్‌రావు, నాగరాజు, వీరబ్రహ్మం, రాంచంద్రం తదితరులు ఉన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకల్లో నాయకులు

తూప్రాన్: బాబు జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతి వేడుకలు పట్టణ కేంద్రంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు నర్సింగరావు, కార్యదర్శి గజ్జెల కృష్ణ, నాయకులు మన్నే శ్రీనివాస్, రాములు, అశోక్, నర్సింగరావు, నర్సింలు, లక్ష్మణ్, ప్రవీణ్ కుమార్, రామ్‌ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జికి అభినందనలు



రామకృష్ణారెడ్డిని కలిసిన సతీష్

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ హైకోర్టు నూతన జడ్జిగా నియామకం అయినా వాకిటి రామకృష్ణారెడ్డిని చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామానికి చెందిన యువ న్యాయవాది సతీష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సతీష్‌గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో న్యాయవాదిగా ఒకే ఆఫీస్‌లో కలిసి పని చేయడంతో తమ బృందం సభ్యులతో కలిసి నూతన జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు సుధాకర్, రంజిత్‌కుమార్, రాజారెడ్డి, శివారెడ్డి, రాఘవేందర్ రెడ్డి, అభినందన్‌రెడ్డి, లలిత్ ఉన్నారు.

పోచమ్మా... కరుణించమ్మా..



బోనాలతో వస్తున్న మహిళలు, భక్తులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ప్రధాన వీధుల గుండా ఆలయానికి తరలి వెళ్లి పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరారు. ప్రతి యేటా ఆషాఢ మాసంలో బోనాలు చేయడం ఆనవాయితీగా వస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మట్టి రోడ్లకు మోక్షమెప్పుడు?

- బురదమయంగా మారిన దారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా మారిన జెత్రం తండా- కొత్తవలియా తండా మట్టి రోడ్డు

చేగుంట(తూప్రాన్): ఏళ్లు గడుస్తున్నా మండలంలోని కొన్ని గ్రామాలను కలుపుతూ ఉన్న మట్టి రోడ్లు తారు రోడ్లుగా మార్చకపోవడంతో ఆయా గ్రామాలకు ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. మండల పరిధిలోని పొలంపల్లి నుంచి రెడ్డిపల్లి కాలనీ వరకు 2 కిలోమీటర్లు, రెడ్డిపల్లి నుంచి రుక్మాపూర్ వరకు 2 కిలోమీటర్లు, రుక్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు రెండున్నర కిలో మీటర్లు, గొల్లపల్లి నుంచి మక్కరాజీపేట వరకు, గొల్లపల్లి రహదారి నుంచి కొత్తవలియా తండా వరకు, కసాన్‌పల్లి నుంచి కసాన్‌పల్లి తండా వరకు, చిన్నశివునూర్ నుంచి జాతీయ రహదారి వరకు మట్టి రోడ్లు ఉన్నాయి. ముఖ్యంగా జెత్రంతండా పంచాయతీ పరిధిలో రజ్యాతండా, హన్మంత్ తండా వాసులు వర్షాకాలంలో మట్టిరోడ్డుపై రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లడం, గిరిజన విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి వర్షాకాలం తిప్పలు తప్పడం లేదని గిరిజనులు వాపోతున్నారు. గ్రామాల మట్టిరోడ్లను తారు రోడ్లుగా మార్చాలని ఏటా ప్రతిపాదనలు పంపిస్తున్నా నిధులు మాత్రం మంజూరు కావడం లేదని చెబుతున్నారు. వానాకాలంలో ఈ దారుల్లో ప్రయాణం చేయడం గగనంగా మారింది. మండలంలోని కొద్ది గ్రామాలకు మాత్రమే తారు రోడ్లు వేయించడం కోసం తక్కువ నిధులే అవసరం ఉన్నా, అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాలు తండాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. కొత్తగా ఏర్పాటైనా ప్రభుత్వం రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తుందేమో అని ఆశగా ఎదురు చూసి ఏడాది దాటుతున్నా ఫలితం కనిపించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తారు రోడ్ల నిర్మాణం కోసం ప్రత్యేక చొరవను చూపించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మూడేళ్లుగా కోరుతూనే ఉన్నాం



గొల్లపల్లి రహదారి నుంచి జెత్రం తండా, కొత్తవలియా తండాలకు తారు రోడ్డు వేయించాలని జిల్లా అధికారులకు వినతి పత్రాలు అందిస్తూనే ఉన్నాం. వర్షాకాలంలో కొత్తవలియా తండా నుంచి ప్రధాన రహదారి వరకు విద్యార్థులు నడుచుకుంటూ రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. తండాల రోడ్లు నిర్మించేందుకు ప్రత్యేక నిధులు అందించాలి.

– సుభాష్‌నాయక్, జెత్రం తండా

ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ ఉన్న మట్టి రోడ్లు తారు రోడ్లుగా మార్చాలని ప్రతిపాదనలు పంపించాం. తండాలను కలుపుతూ ఉన్న మట్టి రోడ్లను తారు రోడ్లుగా నిర్మించేందుకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు అందించాలని ప్రతిపాదించాం. నిధులు మంజూరు కాగానే నిర్మాణ పనులను చేపట్టేలా చూస్తాం.

– అభినవ్, పంచాయతీ రాజ్ ఏఈ, చేగుంట

జంతువులకు టీకాలు తప్పనిసరి

పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్



కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

పటాన్‌చెరు టౌన్: పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జూనోసిస్ డే ను పురస్కరించుకొని పటాన్‌చెరు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూనోసిస్ అనగా జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధి అని తెలిపారు. మూగజీవాల పెంపకంలో పోషకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. 97 పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది మల్లేశం, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని పశు వైద్యశాలలో ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రాబిస్ టీకాలు వేశారు. కార్పొరేటర్ పుష్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ప్రభుత్వం ఉచిత యాంటీ రాబిస్ టీకాలను ఇస్తుందని తెలిపారు. వైద్య సలహాల మేరకు సకాలంలో పెంపుడు జంతువులకు టీకాలు ఇప్పించాలని కోరారు. రాబిస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డా.వంశీకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదిగంటల పనివిధానంపై ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): పదిగంటల పని విధానం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓను వెనక్కి తీసుకుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అంబేడ్కర్ విగ్రహం చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. అనంతరం అమలు జీఓ కాపీలను దహనం చేశారు. సీఐటీయూ సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని విధానానికి బదులు 10 గంటల పనివిధానం అమలుకు జీఓ జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే జీఓ ప్రభుత్వంవెనక్కి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అనిల్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపుపై సీఐటీయూ ఆగ్రహం



జీఓ కాపీలను దగ్ధం చేస్తున్న మహిపాల్ తదితరులు

జహీరాబాద్ టౌన్: పని వేళలు 10 గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో కాపీలను ఆదివారం సీఐటీయూ నాయకులు దగ్ధం చేశారు. సీఐటీయూ జిల్లాకార్యదర్శి మహిపాల్ ఆధ్వర్యంలో శ్రామిక్ భవనం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీవో కాపీలను దగ్ధం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ...రోజుకి 8 గంటల పనిదినాలు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం 10 గంటలకు పెంచిందన్నారు. కనీస వేతనాలు లేక కష్టాలు పడుతున్న కార్మికులతో వెట్టి చాకిరీ చేయించడానికి పనిగంటలను పెంచిందని ఆరోపించారు. కార్మికులకు వ్యతిరేకమైన ఈ జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం



ఆయుర్వేదం ఉపయోగాల గురించి అవగాహన కల్పిస్తున్న ఇంతెకాబ్ ఆలం

జహీరాబాద్: ఆయుర్వేద మూలికలతో మానవుడు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలుగుతాడని మెలోడిస్ అంబ్రోసియా శాస్త్రవేత్త ఇంతెకాబ్ ఆలం అన్నారు. ఆదివారం జహీరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ఆయుర్వేదం వల్ల మనిషికి కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. తల వెంట్రుకలు మొదలుకుని అరికాళ్ల వరకు శరీరానికి ఉపయోగపడేవన్నీ ఆయుర్వేదంలో ఉన్నాయన్నారు. బీపీ, షుగర్, పక్షవాతం, గ్యాస్‌ట్రబుల్, కామెర్లు, స్త్రీల సమస్యలతో పాటు పలు సమస్యలకు పరిష్కారం ఆయుర్వేదంలో ఉందన్నారు. ఆయుర్వేద మూలికలతో తయారు చేసిన అంబ్రోసియా శరీరానికి అవసరమైన శక్తిని ఇవ్వడంతో పాటు అనేక రుగ్మతల నుంచి ఉపశమనం కలిగిస్తుందన్నారు. పూర్వ కాలం నుంచి ఆయుర్వేద వైద్యం అనేక ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపుతోందని తెలిపారు. ప్రజలు క్రమంగా ఆయుర్వేద వైద్యం పట్ల ఆసక్తి చూపుతున్నారు. కార్యక్రమంలో సీఈఓ వివేక్‌గిరి, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



రంగనాయక స్వామికి ప్రత్యేక పూజలు

కొల్చారం(నర్సాపూర్): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా వైష్ణవ దేవాలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రంగంపేటలోని అతి పురాతనమైన శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. వైష్ణవ పూజారులు స్వామివారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణం గోవిందనామాలతో మార్మోగింది.

ఆట పాటలతో సందడి



చిర్రా గోనె ఆటలు ఆడుతున్న యువకులు

శివ్వంపేట(నర్సాపూర్): తొలి ఏకాదశి పండగ సందర్భంగా ఆదివారం ఆట పాటలతో సందడి చేశారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి రైతులు పాడి పంటలతో సంతోషంగా ఉండాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రం శివ్వంపేటలో యువకులు పలు గ్రామీణ ఆటలు ఆడి ఉత్సాహంగా గడిపారు. ప్రతిఏటా తొలి ఏకాదశి రోజున పలు రకాల ఆటలు ఆడడం ఆనవాయితీగా వస్తుంది.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో తొలి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం స్థానిక శ్రీరుక్మిణీ విఠలేశ్వర దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అభిషేకాలను చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం పల్లకీసేవను గ్రామ పుర వీధులగుండా భజనలు, కీర్తనల మధ్య నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం



ఇళ్ల పనులు ప్రారంభిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని రామోజిపల్లి గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు పక్కా ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ఇళ్లను నిర్మిస్తుందని, లబ్ధిదారులు ప్రభుత్వ సూచనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నారాగౌడ్, దాచ సంగమేశ్వర్, మాజీ ఎంపీపీ బాసాడ రాజు, రాంచందర్, అశోక్ తదితరులున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



జానకంపల్లిలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

హవేళీఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని జానకంపల్లి గ్రామ ప్రధాన కూడలి వద్ద సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ అధికారులు కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన కూడళి వద్ద నిత్యం ప్రజలు తిరుగుతుంటారు. పశువులు తగిలి షాక్‌కు గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ షాక్‌కు గుయ్యే ప్రమాదం ఉన్నందున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెను ఏర్పాటు చేసి ప్రమాదం జరుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి



చంద్రారెడ్డికి వైద్యాపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జిన్నారం(పటాన్‌చెరు): పేదల ఆరోగ్యానికి వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయమని బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం బొల్లారం శుభకర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడలోని వలస రాష్ట్రాలకు చెందిన పేదల ఆరోగ్యాలకు శుభకర ఆస్పత్రి యజమాన్యం ముందుకు వచ్చి వైద్య శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. శిబిరంలో రోగులకు అధునాతన వైద్య సేవలను అందించడం పై ప్రశంసించారు. వైద్య బృందం రోగులకు ఆర్బీఎస్, బీపీ చెక్ అప్, థైరాయిడ్, టీఎస్ హెచ్, ఈసీజీ వంటి వైద్య సేవలను అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంపత్ రెడ్డి, దీనానాద్, యువజన నాయకులు ప్రవీణ్ రెడ్డి, శుభకర సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఫలహార బండి ఊరేగింపు



ఊరేగింపును ప్రారంభిస్తున్న రవితేజ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని దుర్గాభవాని బోనాల ఉత్సవాల్లో భాగంగా హట్కర్‌పేటలోని ఆటిపాముల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు ఆదివారం వైభవంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నియోజవర్గ నాయకుడు పట్నం రవితేజ ముఖ్యఅతిథిగా హాజరై ఫలహార బండి ఊరేగింపు ప్రారంభించారు. గ్రామ దేవతల అలంకరణ వేషధారణ, డీజే ఆటపాటలు డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు ఆటపాటల మధ్య ఫలహార బండి ఊరేగింపు దుర్గభవాని మందిరం వరకు కొనసాగింది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోపాల్, సాయినాథ్, శ్రీధర్‌రెడ్డి, పీకేఎంయూ సభ్యులు నంద, నానిగౌడ్ పాల్గొన్నారు.

వెలగని వీధిలైట్లు



వీధిలైట్లు వెలగక అంధకారంలో కాలనీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో పలు కాలనీల్లో వీధిలైట్లు వెలగక అంధకారం నెలకొంది. ధనలక్ష్మి కాలనీతో పాటు పలు కాలనీల్లో 20 రోజులుగా వీధిలైట్లు వెలగని విషయం పంచాయతీ సిబ్బందికి చెప్పిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. రాత్రి వేళల్లో చీకట్లో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత పంచాయతీ సిబ్బంది స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేసి అంధకారాన్ని తొలగించాల్సిన అవసరం ఉంది.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

సంగారెడ్డి జిల్లాలో ముస్లింలు ఆదివారం మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమాం హుస్సేన్ ప్రాణ త్యాగాన్ని స్మరించుకునే పవిత్ర దినం సందర్భంగా పట్టణంలో మసీదు నుంచి పురవీధుల గుండా శోభాయమానంగా పీర్ల ఊరేగింపు నిర్వహించారు. కుడుకలు, బెల్లం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



మండలంలోని ఖాజీపేటలో..



పెద్దశంకరంపేటలో పీర్ల ఊరేగింపు



చిన్నశంకరంపేట: నార్సింగి మండలంలో..



తూప్రాన్‌లో కొలువుదీరిన పీర్లు



చేగుంటలో పీర్ల ఊరేగింపు



రామాయంపేటలో షర్బత్ పంపిణీ..



నిజాంపేటలో మసీదు వద్ద ఊరేగిస్తున్న పీర్లు



కొడిపల్లి: మహమ్మద్‌నగర్‌లో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



శివ్వంపేటలో పీర్ల ఊరేగింపు